

'రాళ్లపాడు' కాలువలకు నీరు విడుదల

కుడి కాలువకు నీరు విడుదల చేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు రైతుల కళ్లల్లో ఆనందం చూడడానికి శక్తివంచన లేకుండా కషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాళ్లపాడు రిజర్వాయర్ నిండిన నేపథ్యంలో,ఆదివారం పంట కాలువలకు నీటిని విడుదల చేశారు. ముందుగా రిజర్వాయర్ వద్ద గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వర్షాలు బాగా కురవడంతో,కుంటలు చెరువులన్నీ నీళ్లతో కళకళలాడు తున్నాయన్నారు. అధికారుల సూచనలు పాటిస్తూ, వరిలో మంచి దిగుబడి సాధించి, ప్రతి రైతు ఇల్లు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆకాంక్షించారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వర్లు, ఉమ్మనేని సుబ్బారావు,ఉత్తంది వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం,గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగిరి నాగరాజు, సోంపల్లి మహేహర్, గాలంక ప్రసాద్,ఆడపా రంగయ్య,బొల్లినేని రమణయ్య, రాళ్లపాడు ప్రాజెక్టు డి.ఈ వెంకటేశ్వర్లు, శేషయ్యరైతు సంఘం నాయకులు, కూటమి నాయకులు ఉన్నారు.

కావలి ఎంఎల్ఎ 'కావ్య' పవర్‌కు చెక్..!

- ◆పార్టీని కాపాడుకోవడానికి అధిష్టానం పాట్లు
- ◆మరో 'సత్యవేడు' కాకూడదని నిర్ణయమా..
- ◆'బీద' లేదా 'వేమిరెడ్డి'కి బాధ్యతలు అప్పగింత

కావలి నియోజకవర్గంలోని టిడిపి మరో సత్యవేడు నియోజకవర్గం కాకుడదని ఆపార్టీ అధిష్టానం పున:పరిశీలన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.. ఇప్పటికే కావలిలో ఉన్న విభేదాలు చక్కబెట్టడంలో చంద్రబాబు నాయుడు, లోకేష్ పూర్తిగా నిర్లక్ష్యం చేశారు.. అందుకే పెద్దమూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.. 40 ఏళ్ల నుంచి పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి నిర్లక్ష్యం చేసి, పార్టీని దెబ్బతీస్తున్నారని గ్రహించిన అధిష్టానం రానున్న మూడేళ్లలో కావలి నియోజకవర్గంలో పార్టీని కాపాడుకునే పనిలో పడింది. స్థానిక ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి పవర్‌కు చెక్‌పెట్టడానికి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం..తన వద్ద ఉన్న నివేదికతోపాటు స్వయంగా పరిస్థితి అధ్యయనం చేసిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యాక్షన్‌లోకి దిగినట్లు తెలిసింది.. నియోజకవర్గంలో కీలకమైన నేతలు బీద సోదరులకు అధికారిక బాధ్యతలు అప్పగించి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా పెడుతారనే ప్రచారం సాగుతోంది. ఇది ఇప్పుడే జరుగుతుందా ? కొంత సమయం తీసుకుంటారా? అనే చర్చ జోరుగా సాగుతోంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : కావలి తెలుగుదేశం పార్టీలో విభేదాలను నిర్లక్ష్యం వహించినందుకు చంద్రబాబునాయుడు, నారా లోకేష్ మూల్యం చెల్లించుకుంటున్నారు. టిడిపిలో ఉన్న నేతలను కాదని ఇతర పార్టీల నుంచి అభ్యర్థులను తెచ్చిపెట్టుకున్న కొందరు వ్యక్తులు ఆ పార్టీని దెబ్బతీస్తున్నారని ఇప్పటికే రాష్ట్ర నాయకత్వం వద్ద స్పష్టమైన ఆధారాలున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల పరిస్థితి దీనికి అద్దం పడుతోంది. కావలి నియోజకవర్గంలో బీద రవిచంద్ర, మాలేపాటి కుటుంబం పార్టీ ఏర్పాటు నుంచి కొనసాగుతున్నారు. బీద మస్తాన్‌రావు అటు , ఇటు తిరిగి ఇప్పుడు టిడిపిలో ఉన్నారు. వైసిపి నుంచి 2024 ఎన్నికల సమయంలో టిడిపిలోకి వచ్చిన ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి ఘన విజయం సాధించారు. ఆయన ఆర్థిక బలంతోపాటు, ఆపార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉంది. గెలిచిన తరువాత ఈ విషయాన్ని మరిచిపోయి టిడిపి సీనియర్ నాయకులనే ఆయన టార్గెట్‌గా చేసుకున్నారనే ప్రచారం ఉంది. మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబంతోపాటు ఇటీవల బీద సోదరులపైనా ఆయన అక్కసు కక్కుతున్నారని సమాచారం. 2024 తరువాత సిఎం చంద్రబాబు నాయుడు కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. ఏ నియోజకవర్గానికి ఆ ఎంఎల్ఎనే కింగ్ అంటూ చెప్పడంతో ఎంఎల్ఎలు రాజు, మంత్రి, అంతా తామే నడుచుకుంటున్నారు. ఎంపి, ఎంఎల్సిలతోపాటు ఏ ఒక్క ప్రజా ప్రతినిధికి నియోజకవర్గాల్లో గౌరవం దక్కడం లేదనే ఆవేదన కొందరిలో ఉంది. కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి కొంత ముందు అడుగు వేసి, తన నియోజకవర్గంలో తన ఫ్లెక్సీలు కాకుండా ఏ ఒక్క నాయకుడి ఫ్లెక్సీలు, పబ్లిసిటీ ఉండకూడదనే ఆదేశాలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎంఎల్సి బీద రవిచంద్రలు సిఎం చంద్రబాబు, లోకేష్‌కు అత్యంత సన్నిహితులు. వీరికి ఏలాంటి అధికారాలు లేవంటూ నియోజకవర్గంలోని అధికారులు తమన చేతుల్లో పెట్టుకొని ఆడిస్తున్నారని ఆపార్టీ నేతలంటున్నారు. ఇక్కడే సమస్య మొదలై మాలేపాటి కుటుంబంలో విషాదం, అటు తరువాత జరిగిన పరిణామాలు [illegible] అధికారపార్టీ నేతలే ఒకరిని ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. ఎంఎల్ఎ చుట్టూ అనేక వివాదాలున్నాయి. మనిస్కామ్, భూ సమస్యలు, సొంత పార్టీనేతలతో గొడవలు, అన్నదాన క్వార్, ఇలా అనేక సమస్యలున్న నేపథ్యంలో ఇప్పుడు ఇంతో విషయంలో ముదిరింది. టిడిపి రెండు గ్రూపులుగా చీలిపోయింది.. వచ్చే ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన ఆపార్టీనేతల్లో నెలకుంది.

'కావ్య' పవర్‌కు చెక్..!

కావలి నియోజవర్గంలో టిడిపిని కాపాడుకోడానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి వెళ్ళినట్లు సమాచారం. వైసిపి నుంచి వచ్చిన కావ్య టిడిపి నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా వ్యవహరిస్తుండడంతో అధికారపార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక్కడ నుంచి ఎంపి, ఎంఎల్సి ఉన్నప్పటికీ ఎంఎల్ఎనే సూపర్ పవర్‌గా ఉంటున్నారు. పార్టీ ఆదేశాలు కూడా అవే. అయితే దీనిని దుర్వినియోగం చేస్తున్నారని గ్రహించిన పార్టీ దిద్దుబాటు కార్యక్రమానికి శ్రీకారం చుట్టడానికి సర్వం సిద్ధం చేసినట్లు సమాచారం. మాలేపాటి కుటుంబం తోపాటు, పార్టీలో సీనియర్ నాయకులు, బీద సోదరుల పట్ల అక్కస్సుతో ఉన్నట్లు పార్టీ గుర్తించినట్లు తెలిసింది. ఇది ఇలానే కొనసాగితే పార్టీ పూర్తిగా దెబ్బతినడం ఖాయంగా కనిపిస్తుండడంతో సత్యవేడు పరిస్థితులు కావలిలో రాకూడదనపే ఉద్దేశంతో ఎంఎల్ఎ ఫవర్‌కు చెక్ పెట్టడానికి సర్వం సిద్ధం చేసినట్లు సమాచారం. కొద్దికొద్దిగా తగ్గించి, పార్టీ నాయకత్వం చేతిలో పవర్ పెట్టనున్నారు. ఇటీవల నారా లోకేష్ దగదర్తి వచ్చినప్పుడు కావలి డిఎస్‌పిని పిలిచి మాట్లాడారు. మాలేపాటి కుటుంబం చూపించిన ఆధారాలు చూసి లోకేష్ విస్మయం చెందినట్లు తెలిసింది. అప్పుడే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. తిరుగు ప్రయాణంలో ముసునూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పి అజితాతో ప్రత్యేకంగా మాట్లాడారు. పాలనా విషయంలో ఎలా వ్యవహరించాలో సూచించినట్లు తెలిసింది. మాలేపాటి కుటుంబ సభ్యులతో మాట్లాడిన సమయంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని పక్కన పెట్టుకొని మాట్లాడారు. నియోజవర్గంలో బలమైన క్యాడర్ ఉన్న బీద సొదరులకు బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం సాగుతోంది. పెద్దగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. దీనిని వెంటనే అమలు చేస్తారా ? కొంత సమయం తీసుకుంటారా చూడాలి.

కావ్యకృష్ణారెడ్డి, ఎంఎల్ఎ కావలి

మాట్లాడుతున్న డిఎస్‌పి బాలసుబ్రమణ్యం

కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు సబ్ డివిజన్ పోలీసు ఆఫీసులో ఆదివారం డిఎస్పీ బాలసుబ్రమణ్య సమీక్షాసమావేశం నిర్వహించారు. సబ్‌డివిజన్‌లోని అన్ని కేసులను పరిశీలించడం జరిగింది. కేసులలో ప్రధానంగా దొంగతనాలు, క్రిమినల్ దాడులు వంటికేసుల దర్యాప్తు వెంటనే పూర్తి చేయాలని అదేశించారు. సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట, కోడి పందాలు , గంజాయి, బెట్టింగ్ లవంటి వారిపై నిఘా పెట్టి వారిపై కేసులు నమోదు చేసి జైలు కు పంపాలని సూచించారు. ఈ క్రైమ్ మీటింగ్‌లో కందుకూరు,గుడ్లూరు సిఐ లు అన్వర్ భాషా,మంగారావు,కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వివి పాలెం ఎస్ఐ లు పాల్గోన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల12న నియోజకవర్గ కేంద్రాలలో జరగనున్న కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుకూరు పామూరు రోడ్ లోని వైఎస్ఆర్పిపి కార్యాలయంలో పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండల అధ్యక్షులు ఈదర రమేష్,ఉలవపాడు మండల కన్వీనర్ నన్నం పోతురాజు,రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, రాష్ట్ర కల్చరల్ విభాగం అధికార ప్రతినిధి వి కోటేశ్వరరావు ఉన్నారు.

హామీలను అమలు చేయాల్సిందే..!

ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ - ఘనంగా నగర 5వ మహాసభ

మాట్లాడుతున్న ఆవాజ్ నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో 54వ డివిజన్ టిడ్కో అపార్టుమెంట్స్ వద్ద ఉన్న కమ్యూనిటి హాలు నందు ఆవాజ్ నగర 5వ మహాసభ నిర్వహించారు. ముందుగా ఆవాజ్ జెండాను సీనియర్ నాయకులు రియాజ్ ఆవిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈ మహాసభల్లో నిర్వహించిన ప్రతినిధులు సభలో జిల్లా కార్యదర్శి రషీద్ మాట్లాడుతూ 2022 నుంచి ఆవాజ్ మైనారిటీల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. జాతీయ స్థాయిలో మైనారిటీల పై దాడులు జరిగినప్పుడు కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నికల సమయంలో మైనారిటీలకు ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదన్నారు.50 సంవత్సరాలకు పెన్షన్లు, దులహన్ పథకం అమలు, ఇమామ్, మౌజన్ లకు గౌరవవేతనాలు ఇవ్వ డంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మైనారిటీల సమస్యలపై అవగాహన చేసుకుని చైతన్యవంతం కావాలిని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు షేక్ రియాజ్ మాట్లాడుతూ హక్కుల పై ప్రస్తుతం దాడి జరుగుతుందన్నారు. హక్కుల కాపాడుకోవడం కోసం ఆవాజ్ ని బలోపేతం చేసుకోవాన్నారు. ఆవాజ్ జిల్లా కోశాధికారి షేక్ చాన్ బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. సిఐటియు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, ఐద్వా నగర కార్యదర్శి కె. పద్మ సౌహార్ద ప్రసంగించారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం13 మంది తో ఆవాజ్ నగర నూతన కమిటీ ఎన్నిక. అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ ఫయాజ్, షేక్ రియాజ్ లు, సహాయ కార్యదర్శి గా షేక్ అల్లా బక్షు, ఉపాధ్యక్షులు గా షేక్ రియాజ్, కోశాధికారి గా షేక్ ఇమ్రాన్ లు ఏ కగ్రీవంగా ఎన్నికయ్యారు.

అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, రియాజ్

రూ. 8 కోట్లతో అభివృద్ధి పనులు : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారమే కందుకూరు నియోజకవర్గం అతిత్వరలో ప్రకాశం జిల్లాలో కలవబోతుందని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఇంటూరి మీడియా సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడారు. కందుకూరు నియోజకవర్గ ప్రజలను గత వైసిపి ప్రభుత్వం నిలువునా మోసం చేసి, లక్షల మంది అభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రకాశం జిల్లా నుంచి విడదీసి నెల్లూరులో కలిపారని గుర్తు చేశారు.జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరి చేసుకుంటూ వస్తోందన్నారు. పట్టణంలో త్వరలో 8 కోట్ల రూపాయలతో కొత్త పనులు మొదలు పెట్టబోతున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

ఇల్లు కూల్చివేత దారుణం : వైసిపి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :పేద దళితుల ఇళ్ళు కూల్చమని టిడిపి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఉందా అని ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని వైసీపీ కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ ప్రశ్నించారు. తోటపల్లిగూడూ రు మండలం తోటపల్లి పంచాయతీ డక్కిలి వారిపాలెం గ్రామానికి చెంది న మీదూరు శినయ్య, దారా విజ య్ కుమార్ లు ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఇంటిని అధి కారులు ఈ నెల 08వ తేదీన కూల్చి వేసిన విషయం విధితమే. టిడిపి ప్రభుత్వం నిరుపేద దళితుని ఇంటి కూల్చివేతపై శంకరయ్య గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంటి కూల్చివేతను తీవ్రంగా ఖండించారు. కూటమి (టీడీపీ) ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఒకటిన్నర ఏడాది కావస్తుంటే పేదలకు ఒక్క ఇంటిని కూడా కట్టించ లేదు గానీ నిరుపేదలు, అదీ దళితులు ఎంతో కష్ట పడి కట్టించుకొన్న ఇంటిని మాత్రం కూల్చేసిందని శంకరయ్య గౌడ్ ఎద్దేవా చేశారు. తోటపల్లి సర్పంచ్ ఈదూరు రామాచార్యులు, జెడ్పిటిసీ శేషమ్మ, ఎంపీటీసీ రాయపు సీనయ్య, మాజీ జెడ్పిటిసీ చిరంజీవి గౌడ్, ఎంబేటీ సంధ్యారాణి, వైసిపి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శంకరయ్య గౌడ్

తల్లిదండ్రుల చెంతకు బాలలు

ప్రజాశక్తి -కందుకూరు : తప్పిపోయిన ముగ్గురు పిల్లలను గంటల వ్యవధిలో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన కందుకూరు పోలీసులు చేర్చారని కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం తెలిపారు.ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ 7తేది శనివారం సాయంత్రం కందుకూరుకు చెందిన 13 ఏళ్ల వయస్సు గలిగిన ముగ్గురు పిల్లలు ట్యూషన్ కి అని వెళ్లి ఇంటికి రాలేదని రాత్రి 11 గంటల సమయంలో కందుకూరు పోలీసులకు తల్లిందండ్రులు ఫిర్యాదు చేశారు.జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, కందుకూరు డిఎస్పీ సుబ్రహ్మణ్యం అధ్వర్యంలో, కందుకూరు సిఐ అన్వర్ బాషా సిబ్బందిని రెండు ప్రత్యేక బందాలుగా ఏర్పరిచి బీట్ ,మొబైల్ పార్టీలను అప్రమత్తం చేసి, బస్టాండ్, రైల్వే స్టేషన్ లలో రాత్రంతా కందుకూరు పోలీసులు వెతికారు.పోలీసుల సమర్థవంతమైన సమన్వయం, క్షుణ్ణంగా నిర్వహించిన శోధన ఫలితంగా తప్పిపోయిన ముగ్గురు పిల్లలను అనకాపల్లి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు.దాంతో తల్లిదండ్రులకు పిల్లలు ఉన్నారని తెలపడంతో ఊపిరి పీల్చుకున్నారు.తప్పిపోయిన పిల్లలను కనుగొని క్షేమంగా గంటల వ్యవధిలో వారి తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా చేర్చడంలో పోలీసులు చాకచక్యాన్ని ప్రదర్శించారని డిఎస్పీ తెలిపారు.అనంతరం పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, చిన్నపిల్లల సంరక్షణలో అశ్రద్ద పనికిరాదని మందలిస్తూ తప్పిపోయిన వారిని క్షేమంగా వారికి అప్పగించినట్లుతెలిపారు.దీంతో తల్లిదండ్రులు పోలీసులకు అభినందలను తెలిపారు. కందుకూరు సిఐ అన్వర్ భాషా,కందుకూరు పట్టణ ఎస్ఐ శివ నాగరాజు పాల్గోన్నారు.

హక్కుల కోసం పోరాటం

ప్రజాశక్తి-నెల్లూరు :ఇటీవల తిరుపతి లో నిర్వహించిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 13 వ రాష్ట్ర మహాసభల్లో ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కట్టా సుబ్రమణ్యంకు ఘన సన్మానం నిర్వహించారు. ఆదివారం నగరంలోని ఆర్‌టిసి ప్రధాన బస్టాండ్ ఆవరణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు 1డిపో మాజీ అధ్యక్షులు యు. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. చివరిగా కట్టా. సుబ్రమణ్యం మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు నిరంతరం పోరాటం చేస్తామన్నారు.



సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు :అన్నమయ్య జిల్లా, రాయచోటి ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన ఎన్‌టిఎ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలను జిల్లా నాయకులు ప్రస్థావించారని జిల్లా అధ్యక్షులు నాటకం తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎన్‌టిఎ అధ్యక్షులు మాట్లాడారు. జిల్లా నుంచి చంద్రశేఖర్ రెడ్డి, భాస్కర్, సైమన్ కుమార్ పాల్గొన్నారు

రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి

రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా రైతాంగం కష్ట నష్టాలను అధిగమించి వరి నాట్లు ప్రారంభించారని, రైతులు తాము ఆశించిన స్థాయిలో పంట దిగుబడి ఉండాలన్న ఆశయంతో పురుగు, తెగుళ్ల నుంచి కాపాడుకొనేందుకు వినియోగించే యూరియా తగినంత మేరకు ప్రభుత్వం సరఫరా చేయలని రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా రైతాంగం వరి సాగుబడి చేసేందుకు కావాల్సినంత నీరు జలాశయాలల్లో పుష్కలంగా ఉందని, అయితే ఎంతో కష్టా, నష్టాలను ఎదుర్కొని రైతులు వరి నాట్లు వేసి పంటను కాపాడుకొనేందుకు వినియోగించే యూరియాను అవసరమైన మేర సరఫరా చేయలేని దుస్థితిలో ప్రభుత్వ పరిపాలన ఉందన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 8 లక్షల ఎకరాలు వరి పైరు వేసేందుకు సాగు నీరు సిద్ధంగా ఉందని చెబుతున్నారు. వరి పంటకు ప్రధానంగా అవసరమైన యూరియా అందించుటలో గత కొద్ది సంవత్సరాల నుంచి ప్రభుత్వం అనేక ఒడిదుడుకులకు లోనౌతుందన్నారు. రైతాంగం ఒక్క ఎకరానికి 4 లేక 5 కట్టల యూరియా వేయడం అలవాటుగా చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం 3 కట్టలు ఉపయోగిస్తే సరిపోతుందని అదే శాస్త్రీయ పద్ధతిని అదనంగా వాడడం అనారోగ్యానికి హేతువుతోందని ప్రకటించిందన్నారు. పదుల సంవత్సరాల నుంచి 4, 5 కట్టల యూరియాను రైతాంగం ఉపయోగిస్తున్న సందర్భంలో ఆరోగ్య సమస్యలు ఏవి వచ్చినట్లు దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న 3 కట్టలు కూడా మూడు దఫాలుగా ఇస్తామని ప్రకటించారు. ఇస్తున్న యూరియాకు అవసరం ఉన్నా లేకపోయినా ఇతర ఎరువులను కొనుగోలు చేయాలని ఆంక్షలు విధించడాన్ని, రైతులను ఆంక్షల పేరుతో వివిధ రకాలుగా ఇబ్బందులు పెట్టడాన్ని ఏపి రైతు సంఘం జిల్లా కమిటీ ఖండిస్తుందన్నారు. సరైన గణాంకాలను తీసుకొని సకాలంలో తగినంత యూరియాను రైతులకు గ్రామాలలోని అందజేయాలన్నారు. రైతు సంఘం కార్యదర్శి మూలి వెంగయ్య, అధ్యక్షుడు పూడిపర్తి జనార్ధన్, ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్, పి.శ్రీరాములు, సహాయ కార్యదర్శి ఎల్‌కె ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

వంతెన పనులు ప్రారంభించే వరకు

దశల వారీ పోరాటం

ప్రజాశక్తి-నెల్లూరు :చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతంలో జాతీయ రహదారికి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నిధులు విడుదల చేశామని ఒకరు.. సమస్య తీవ్రతను వివరించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం అందజేశామని మరొకరు ప్రకటనలు చేయడం కాదని, పనులు ప్రారంభించే వరకు దశల వారీ పోరాటం నిర్వహించడం తథ్యమని అండర్ పాస్ బ్రిడ్జి సాధన కమిటీ పేర్కొంది. ఆదివారం నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో అండర్ పాస్ బ్రిడ్జి సాధన కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ విషయంపై రూరల్ ఎంఎల్ఎ కొటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కోరడం సంతోషకరమని, అదే సమయంలో మంత్రి పి.నారాయణ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.121 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ నేపథ్యంలో చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న మానవహారం నిర్వహిస్తామన్నారు. నిర్మాణ పనులు ప్రారంభం కాని పక్షంలో తమ పోరాటం తీవ్ర తరం చేస్తామని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.నాయకులు జి.కోటిరెడ్డి, సాధన కమిటీ కన్వీనర్ కాయంబు శ్రీనివాసులు, జె.సుధాకర్, డి.ప్రసాద్, ఎం.నారాయణ, నారాయణరెడ్డి, సంపూర్ణమ్మ, పి.జనార్ధన్, కట్టా సతీష్, పలువురు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

రూ .115 కోట్ల

మంత్రి హామీ ఇచ్చారన్న వేమిరెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి నగరంలోని చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి కోసం సిపిఎంతోపాటు స్థానిక ప్రజలు ఏన్నో యేళ్లగా ఉద్యమం చేస్తున్నారు. తాజాగా ఇక్కడ అండర్ పాస్ బిడ్జి కోసం రూ 115 కోట్లు మంజూరు చేశారని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు.ఈ ప్రకటన పట్ల ఉద్యమకారులు సంతోషం వక్తం చేస్తూనే తమ అనుమానాలు తెలిపారు. పనులు ప్రారంబించే వరకు ఉద్యమం కొనసాగుతందని పోరాట కమిటీ నాయకులు ఆర్ శ్రీనివాసులు తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి : పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 21మందికి మంజూరైన రూ.15లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. మాజీ మేయర్ బానుశ్రీ, క్లస్టర్ ఇంచార్జ్ లు జలదంకి సుధాకర్, మన్నెం పెంచల నాయుడు, మన్నేపల్లి రఘు, షంషుద్దీన్ పాల్గొన్నారు.

కందుకూరు : సిఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్దిదారులకు అందజేశారు.777 మంది లబ్ధిదారులకు రూ.6.30 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పంపిణీ చేసినట్లు వెల్లడించారు.పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రతి ఏటా లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ప్రచార కార్యాక్రమాలల్లో చేసిన హామీలు అమలు చేయడంలో పూర్తి స్థాయిలో వైఫల్యం చెందాయని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ పేర్కొంది. డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్స కార్యక్రమాలను పురస్కరించుకోని 54వ డివిజన్‌లోని భగత్‌సింగ్ కాలనీలో డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు జి నాగేశ్వరావు మాట్లాడుతూ మాట్లాడారు. డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు జగదీష్, శేఖర్ మాజీ నాయకులు ప్రసాద్, జాఫర్ స్థానిక డివైఎఫ్ఐ నాయకులు ఖాజా, శ్రీహరి, జయరాం, సాయి, సుధాకర్ ఉన్నారు.

నెల్లూరులో "బ్లేజ్ ఆఫ్" సాఫ్ట్‌వేర్ కంపెనీ..!

సొంత ఊరుపై మమకారంతో నెల్లూరీయుడు, ప్రవాసాంధ్రుడు నెల్లూరు నగరంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించారు.. తొలి విడతగా 100 మంది యువతకు ఉద్యోగ అవకాశం కల్పించారు. మురో వంద మందికి రానున్న రోజుల్లోనే అవకాశం వచ్చే అవకాశం ఉంది. రూ 500 కోట్లు టార్గెట్ లక్ష్యంగా నెల్లూరు కేంద్రంగా కంపెనీ నడపనున్నారు.. సాఫ్ట్‌వేర్ రంగంలో నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని "బ్లేజ్ ఆఫ్" కంపెనీ చైర్మన్ రెనిల్ కుమార్‌రెడ్డి చెబుతున్నారు. స్థానిక యువతకు ఈ కంపెనీ నూతన ఆశలు కల్పిస్తోంది.

- ❍100 మంది యువతకు ఉద్యోగ అవకాశం
- ❍రూ 500 కోట్లు టార్గెట్
- ❍నైపుణ్యానికి ప్రాధాన్యత :చైర్మన్

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాలకే పరిమితమైన సాఫ్ట్ వేర్ రంగం ఇప్పుడు నెల్లూరుకు వచ్చింది. నెల్లూరు నగరానికి చెందిన రెనిల్‌కుమార్‌రెడ్డి అమెరికాలో స్థిరపడి అటు తరువాత 17 ఏళ్ల కిందట ఇక్కడ కంపెనీ పెట్టాలనే సంకల్పం సాకారం అయింది. ఆయన వినూత్న సాంకేతిక ఆలోచనల నుంచి పుట్టిన టెర్రాలాజిక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అమెరికాలో, ఇండియాలో విస్తత సేవలందిస్తోంది. తన సొంత ఊరు నెల్లూరు నగరంలో సైతం సాఫ్ట్‌వేర్ రంగాన్ని తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 17 ఏళ్ల కిందటే 'టెర్రాలాజిక్'ను స్థాపించి యువ తకు ఉపాధి అవకాశాలు కల్పించారు. తాజాగా నెల్లూరు నగరం మరో సాఫ్ట్‌వేర్ రంగంతో ముందుకొచ్చారు. అన్ని ఎంటర్‌ప్రైజ్ ఆపరేషన్స్‌కు ఉపయో గపడే ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ ఫ్లాట్‌ఫాం 'బ్లేజ్‌అప్'ను ఆదివారం నెల్లూరులో నుంచి ప్రారంభించారు. ద్వితీయ స్థాయి నగరం నుంచి ఒక అంతర్జాతీయ స్థాయి 'యాప్'ను ఆవిష్కరిస్తుండడం ఇదే ప్రథమం. సాఫ్ట్‌వేర్‌లో వరల్డ్‌క్లాస్ ప్రొడక్ట్ తయారు చేయడానికి అమెరికాలోని సిలికాన్ వ్యాలీ, ఇండియాలోని మెట్రోసిటీలలో ఉండాల్సిన అవసరం లేదని, సరైన టీమ్, సరైన విజన్, సరైన పర్పస్ ఉంటే ఎక్కడనుండైనా ప్రొడక్ట్ లాంచ్ చేయవచ్చని చాటిచెప్పడమే రెనిల్‌కుమార్‌రెడ్డి దీనిని ప్రారంభించినట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభిస్తున్న దృశ్యం

నగరంలో 'బ్లేజ్‌అఫ్' కంపెనీ..!

బ్లేజ్‌అప్ అనేది ఒక యూనిఫైడ్, ఇంటెలిజెంట్, ఏజెంటిక్ సొల్యూషన్. ఇది బిజినెస్‌లు ఎలా ఆపరేట్ అవుతాయో పూర్తిగా మార్చేస్తుంది. ఇంకా ప్రొడక్టివిటీని బూస్ట్ చేస్తుంది. ఎంటర్‌ప్రైజ్‌లను ఎ.ఐ ఏజెంట్స్‌తో ఎంపవర్ చేయాలనే విజన్‌తో బిల్ట్ చేయబడిన బ్లేజ్‌అప్, హెచ్ఆర్, ఫైనాన్స్, ఐటి, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సిఆర్ఎం వంటి ఆపరేషన్లను ఒకే ఇంటెలిజెంట్ ప్లాట్‌ఫార్మ్‌లో సింప్లిఫై చేస్తోంది. ఇప్పటి మార్కెట్ ఎఫిషియన్సీ, గ్రోత్ అని ప్రామిస్ చేసే టూల్స్ ఉన్నాయి. రియాలిటీ బిజినెస్‌లు ఇంకా ప్రాగ్మెంటెడ్ సిస్టమ్స్‌తో స్ట్రగుల్‌తో నడుస్తున్నాయి. టూల్స్ మధ్య ప్రాపర్ ఇంటిగ్రేషన్ లేక, కస్టమైజేషన్ లిమిటెడ్, సాఫ్ట్‌వేర్ ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ సమస్యని పరిష్కరించడానికే మూడు సంవత్సరాలు ఒక టీమ్‌తో కలిసి బిజినెస్‌లు ఎలా వర్క్ అవుతున్నాయో డిఫరెంట్ డొమెయిన్స్‌లో స్టడీ చేశారు. టెర్రాలాజిక్ యొక్క కొత్త బ్రాంచ్ 17 ఏళ్ల కిందట నెల్లూరులో ప్రారంభించినప్పుడు ఆ చిన్న స్పార్క్ ఇప్పుడు ఒక పెద్ద విజన్‌గా మారి బిజినెస్ కాంప్లెక్సిటీస్‌ని సింప్లిఫై చేయడానికి 'బ్లేజ్‌అప్' రూపంలో వెలుగు లోకి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

నైపుణ్యానికి ప్రాధాన్యత : ఆర్‌కె రెడ్డి

నెల్లూరు నగరంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించడం సంతోషంగా ఉందని, ప్రస్తుతం తమ వద్ద వంద మంది యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించామని సంస్థ చైర్మన్ రెనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మాగుంట లేవుట్‌లోని కంపెనీని లాం ఛనంగా ప్రారంభించారు. రానున్న రోజుల్లో మరో వంద మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, ఎక్కడా సిఫార్సులకు తావు లేకుండా కంపెనీ నడుస్తుందన్నారు. అమెరికా లోనూ, నెల్లూరు లోనూ ఈ కంపెనీ 13 రోజుల కిందటే రిజిస్టేషన్ చేయిం చినట్లు తెలిపారు. రూ 500 కోట్లు టార్గెట్‌గా చెప్పారు. నెల్లూరు యువతకు ఉద్యోగం కల్పించడంతోపాటు, సొంత గడ్డకు ఏదో చేయాలనే ఆలోచనతో సంస్థ ప్రారంభిమానని, త్వరలో విశాఖపట్నంలోనూ సంస్థ ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు.

కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్ :నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో పట్టణ ప్రణాళిక విభాగం తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులతో కమిషనర్ మాట్లాడుతూ ఎల్.ఆర్.ఎస్ కు సంబంధించిన ఐ.పి.ఎల్.పి అప్లికేషన్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ హిమబిందు, డిప్యూటీ సిటీ ప్లానర్ రఘునాథరావు,సిటీ ప్లానర్లు వేణు,మురళీ,టి. పి. బి. ఓ.లు, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

ప్రజల కోసమే కోటి సంతకాల ఉద్యమం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకొని ప్రజలకు మంచి చేయడానికి వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో కోటి సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టామని ఆత్మకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఇన్‌ఛార్జి ఇందూరు సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో గృహాలకు వెళ్లి మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వల్ల పేద విద్యార్థులకు జరిగే నష్టాలను వివరిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్యను అందించాలన్న సంకల్పంతో జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం వాటిని ప్రజలకు దూరం చేసే దుర్మార్గానికి పూనుకుందన్నారు. పిపిపి విధానం వల్ల ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏం లేదన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ బూత్ కమిటీల అధ్యక్షులు బత్తిన నారాయణరెడ్డి, పట్టణ రైతు విభాగ ఉపాధ్యక్షులు జెట్టి కృష్ణారెడ్డి, బత్తిన చిన్నసుబ్బారెడ్డి, ములుమూరి కామాక్షిరెడ్డి, కొల్లకొండూరు అశోక్ రెడ్డి, పట్టణ దివ్యాంగుల విభాగ అధ్యక్షులు చింతలపల్లి వెంకటేశ్వర్లురెడ్డి, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, ఇందూరు నాగేంద్రరెడ్డి, వంచిపాటి వెంకటేశ్వర్లురెడ్డి, వంచిపాటి వంశీరెడ్డి, మెట్ట కోటిరెడ్డి, పల్లంరెడ్డి ప్రదీప్ రెడ్డి, బత్తిన కిషోర్ రెడ్డి, ఏటూరు చిన పెంచలరెడ్డి, వంచిపాటి పవన్ కుమార్ రెడ్డి, రామిరెడ్డి గోపాల్ రెడ్డి, బిట్టమూరు మోహన్ రెడ్డి, నాగులపాటి పవన్ కుమార్ రెడ్డి, అల్లారెడ్డి అఖిల్ రెడ్డి, మహిళా నాయకులు కారంపూడి ఆదెమ్మ, అల్లారెడ్డి శ్రీదేవమ్మ, అల్లారెడ్డి సుశీలమ్మ, బత్తిన లక్ష్మి, బత్తిన సుప్రజ, షేక్ అమీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలం నందవరంలో మాజీ ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణను చేపట్టారు. నాయకులు ప్రతి ఇంటింటికి వెళ్లి పేద విద్యార్థులకు వైద్య విద్య మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో వైసిపి ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలలను మంజూరు చేసిందన్నారు. ఇప్పుడు వాటిని పిపిపి విధానంలో ప్రయివేటీకరణ కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదన్నారు. దానిపై రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టిందని. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఒంటెద్దు కృష్ణారెడ్డి, ఖాదర్ బాషా, ప్రసాద్‌గౌడ్, నూనె ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలో శనివారం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో కావలి మాజీ ఎంఎల్‌ఎ, వైసిపి కావలి ఇన్‌ఛార్జ్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం మండల ఎస్‌సిసెల్ అధ్యక్షులు విశ్వనాథరావుపేట ఎంపిటిసి ఏకే సుందర్ రాజ్, బోగోలు పంచాయతీలోని జెడ్‌పిటిసి కీర్తన, బేతనిపేటలో బంక కమలాకర్, నరస బాబు, కప్పరాల తిప్ప గ్రామంలో సాల్మన్ రాజ్, సురేష్, వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ మద్దిపోయిన వీరయ్య, తాళ్లపల్లి సాగర్, గోమరం రాజ్ కుమార్, ఎండ్లూరి తిరుపతి, పిరిగ బుజ్జయ్య, నెల్లూరు శివా రెడ్డి, దువ్వ పరమేష్ రెడ్డి, ఒంగోలు నాగరాజు, కోశిదం వంశీ, గోమెరం సాయిగణేష్, ఎండ్లూరి శ్రీనివాసులు, గున్న బాలాజీ, కొట్టే మణికంఠ, పగడాల తేజ, ఎస్.కె సలీం, ఎస్.కె ఖాదర్ భాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-కావలి : మక్కెన రమేష్ - ప్రశాంతి దంపతుల కుమార్తె చిన్నారి భావన తన పుట్టినరోజును పురస్కరించుకుని పేదల మధ్య జరుపుకోవాలనే ఆలోచనతో ఆదివారం కావలి పట్టణం తుఫాన్ నగర్లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, ట్రస్టీ బీరధ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారి భావన మాట్లాడుతూ గత 13 సంవత్సరాల పాటు తన తల్లిదండ్రులు తన పుట్టినరోజును ఇంట్లోనే జరుపుతూ ఉండగా కానీ ఈసారి తన పుట్టినరోజును పేదల మధ్య జరుపుకోవాలని అనుకున్నానని తెలిపారు. తన తల్లిదండ్రులు తనకు పాకెట్ మనీ కోసం ఇచ్చే సమయంలో ఖర్చులకోసం ఇచ్చే డబ్బులను దాచుకొని ఆ డబ్బులతో తన పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేదవిద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశానని తెలిపారు.

లోక్ అదాలత్‌లో అంతిమ తీర్పు

ప్రజాశక్తి-కావలి : లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు అప్పీల్ లేని అంతిమ తీర్పు కోర్టు ద్వారా ఇవ్వడం జరుగుతుందని కావలి లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. లోక్‌అదాలత్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కావలి పట్టణం ముసునూరు గిరిజన కాలనీలో లోక్ అదాలత్ చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాలకొండా రెడ్డి పాల్గొన్నారు. 1987 నవంబర్ 9న న్యాయ సేవాధికార చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం జరిగిందని తెలిపారు. నేటితో ఈ చట్టానికి 38ఏళ్లు అని తెలిపారు. నిరుపేదలకు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహాలు, న్యాయవాదులను అందివ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పెండింగ్ కేసులు కోర్టుకు రాని కేసులు ఖర్చు, కాల యాపనలేని అప్పీలైన అంతిమ తీర్పులను ఈ లోక్ అదాలత్ ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కక్షిదారులు కోర్టులో రాజీ పడటం ద్వారా కోర్టు ఖర్చులను తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. సత్వర న్యాయం కోసం ప్రజలు లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలిందని కోరారు. కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

బిఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం

ప్రజాశక్తి-బిట్రగుంట : బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో బిఎంఆర్ యువసేన అధ్యక్షుడు సమీవుల్లా ఆదివారం అల్పాహార విందు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ రవిగిన సారథ్యంలో శిక్షణ పొంది రాష్ట్రస్థాయిలో బిట్రగుంటకు 8 మెడల్స్‌తో గుర్తింపు తెచ్చిన కరాటే విద్యార్థి, విద్యార్థులకు బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ప్రోత్సాహకంగా అందచేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా బిఎంఆర్ యువసేన అధ్యక్షులు షమీవుల్లాను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బుర్హాన్, గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, కుందుర్తి శ్రీనివాసులు, స్వర్ణ రాజ్, అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, బోయపాటి సుధాకర్, మన్యం శ్రీనివాసులు, శ్యాంసుందర్, ముప్పిడి మైసూర్ నేత ఎన్ను ఐజాక్, డబ్బీరు శ్రీధర్‌రావు, బిట్ర రమేష్, రుబీనా, కరాటే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో కార్పొరేట్ వైద్యం

ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి.సుధీర్‌కుమార్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-నెల్లూరు
సమాజంలో అన్నివర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలందించి అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపించాలన్న ఆకాంక్షతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం (పిఎంజెఎవై)ను ప్రారంభించింది. ఈ పథకంలో ఏడాదికి రూ.5లక్షల విలువ చేసే వైద్యసేవలను ఉచితంగా పొందవచ్చని ప్రకటించింది. అటువంటి పథకం జిల్లాలో అమలు చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో డాక్టరు ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టరు ఎన్.వి.సుధీర్‌కుమార్ మాటల్లో..

ప్రశ్న. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం ముఖ్య ఉద్దేశం ఏమిటీ.. ఈ పథకాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు.. ఎవరెవరు ఈ పథకం ద్వారా లబ్ధిపొందగలరు.. ఈ కార్డును ఏ విధంగా ప్రజలు పొందగలరు.. కార్డు హెూల్డర్లకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది..?

జవాబు. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం 2018న సెప్టెంబరు 23వ తేదీన ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆరోగ్య సమస్యల పరిష్కారం చూపించాలని, వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావాలన్నదే ఈ పథకం ముఖ్య లక్ష్యం. ఆర్థిక స్థితితో ఎటువంటి సంబంధం లేకుండా 70యేళ్ల వయస్సు పైబడిన ప్రతి సీనియర్ సిటిజన్ ఈ పథకంలో ఏడాదికి రూ.5లక్షల విలువ చేసే వైద్యసేవలను ఉచితంగా పొందవచ్చు. ఈ పథకానికి ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ పెన్షన్ తీసుకుంటున్న వారు అనర్హులు. సమీపంలోని సచివాలయం నుంచి కానీ, కంప్యూటర్ పరిజ్ఞాన ఉన్నవారు ఇంటర్‌నెట్ ఆధారంగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. పిఎంజెఎవై. జిఒవి.ఇన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

ప్రశ్న. ఈ పథకంలో ఏయే వైద్యశాలల నుంచి వైద్య ఆరోగ్యసేవలు పొందవచ్చు.. కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యచికిత్సలు పొందేందుకు అవకాశం ఉందా.. కుటుంబంలో ఎంత మంది ఈ పథకంలో వైద్యసేవలు పొందవచ్చు.. ఎన్ని లక్షల వరకు అవకాశం ఉంటుంది..?

జవాబు. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకంలో వైద్యసేవలందించేందుకు దేశం మొత్తం మీద ఇప్పటి వరకు 29,648 వైద్యశాలలు రిజిస్ట్రర్ చేసుకున్నాయి. 12,696 కార్పొరేట్ వైద్యశాల యాజమాన్యాలు సైతం తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నాయి. ప్రతియేటా ఒకొక్క కుటుంబానికి రూ.5లక్షల వరకు ఉచింతంగా వైద్యసేవలు పొందవచ్చు. లబ్ధిదారులను సామాజిక, ఆర్థిక పరిస్థితిలను బట్టి ఎంపిక చేస్తారు. ఒకే కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది అనారోగ్యానికి గుర్తై ఉన్నా ఈ పథకంలో రూ.5లక్షలవరకు వైద్యసేవలు పొందవచ్చు.

ప్రశ్న. జిల్లాలో ఇప్పటి వరకు ఎంతమంది తమ పేర్లును నమోదు చేసుకున్నారు.. పేర్లు నమోదు చేసుకొనే సమయంలో ఏమైన సమస్యలు ఏర్పడితే ఆ సమస్యలకు పరిష్కారం చూపించేందుకు టోల్‌ఫ్రీ నెంబర్లు ఏమైనా ఉన్నాయా..?

జవాబు. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకంలో తమపేర్లను నమోదు చేసుకొనేందుకు 849మంది ప్రయత్నించారు. 782మందికి ఈ కార్డులు పోందేందుకు అర్హత సాధించారు. 67 మందికి పలు కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్నాయి. పేర్లను నమోదు చేసుకొనే సమయంలో ఏదైన సమస్యలు ఎదురైతే పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18004258525 సంప్రదించాలి. ఈ పథకంలో 1949 రకాల వ్యాధులకు కార్డు హోల్డర్లు వైద్యసేవలు పొందవచ్చు. పేర్లను నమోదు చేసుకొనే సమయంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయం సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఇటీవల కాలంలో తీయించుకున్న రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ ఐడికి సంబంధించిన సమాచారం అందజేయాల్సి ఉంటుంది.

సీలింగ్ కూలి కార్పెంటర్ దుర్మరణం

ప్రజాశక్తి-కోవూరు
కోవూరు పట్టణ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. లక్ష్మీనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఓ నూతన ఇంటి పనులు జరుగుతున్న సమయంలో సీలింగ్ కూలిపడి కార్పెంటర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కోవూరులోని లక్ష్మీనగర్‌లో ఓ ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆ ఇంటికి కార్పెంటర్‌గా పట్నం ప్రసాద్ (48) పనిచేయడానికి వచ్చాడు. పనులు కొనసాగుతున్న సమయంలో ఇంటి లోపలి భాగంలో సీలింగ్ ఒక్కసారిగా ఊడి కూలి ప్రసాద్‌పై పడింది. దాంతో తలకు తీవ్ర గాయాలు తగిలి ప్రసాద్ అపస్మారక స్థితిలో కుప్పకూలాడు. తక్షణమే సహచర కార్మికులు పరుగున వెళ్లి గాయపడిన ప్రసాద్‌ను బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఆయన మతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న కోవూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో సీలింగ్ పనుల్లో లోపం కారణమా, లేక భద్రతా చర్యలు పాటించక పోవడమేనా అనే అంశంపై పోలీసులు సాంకేతిక నిపుణులతో కలిసి విచారణ జరుపుతున్నారు. మరణించిన పట్నం ప్రసాద్ స్థానికంగా స్లాబ్, వుడ్‌వర్క్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు తెలిసింది. ఒక్కసారిగా అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సహచర కార్మికులు, స్థానికులు తీవ్ర విషాదం వ్యక్తం చేశారు. తమతోపాటు ప్రతిరోజు నవ్వుతూ పనిచేసే ప్రసాద్ ఇలా ఒక్కసారిగా తమను వదిలి వెళ్లిపోవడం నమ్మశక్యంగా లేదు అని సహచరులు వేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతం అంతా విషాద వాతావరణంలో మునిగిపోయింది. మృతుడు ప్రసాద్‌కు బార్య పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి

యోగా థెరపీసెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి
కావలి పట్టణం 29వ వార్డులోని జనతాపేట ప్రాంతంలో "నిరామయ యోగా అండ్ థెరపీ సెంటర్" ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సెంటర్‌ను కావలి ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ శరీర ఆరోగ్యం, మానసిక ప్రశాంతత రెండింటికీ యోగా అత్యంత అవసరమని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడులు, ఆందోళనలు పెరిగిన నేపథ్యంలో యోగా, నేచురల్ థెరపీ ద్వారా ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపగలరని తెలిపారు. ఈ తరహా కేంద్రాలు ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం కొద్ది నిమిషాలైనా యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ఎంఎల్‌ఎ పిలుపునిచ్చారు. ప్రత్యేకించి యువత, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు అందరూ శారీరక మానసిక సమతుల్యత కోసం యోగా సాధనను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులు, యోగాట్రైనర్లు, సెంటర్ నిర్వాహకులు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలుపుతూ యోగా శిబిరాలు, ఆరోగ్య సలహా కార్యక్రమాలు తరచుగా నిర్వహిస్తామని తెలిపారు.

అమెరికా సుంకాలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతసాగరం
వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారతదేశంపై అమెరికా సుంకాలు అనే అంశంపై క్లాసు నిర్వహించారు. ఈ క్లాసుకు గాడి సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ క్లాసును జిల్లా స్టడీ సర్కిల్ నాయకులు శ్రీహరి బోధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంపై అమెకరిక పెత్తనం సాధించాలని ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రపంచంలో అమెరికా డాలర్ విలువ పడిపోతుందని తెలిపారు. డాలర్ విలువ పెంచడం కోసం ఈ రోజు అమెరికా ప్రపంచ దేశాల మీద ట్రంప్ సుంకాల యుద్ధం ప్రకటించారన్నారు. ఈ సుంకాలు భారతదేశం తప్ప మిగతా దేశాలు వ్యతిరేకిస్తున్నారన్నారు. భారత దేశం కూడా ఎగుమతి సుంకాలు రద్దు చేయాలన్నారు. ప్రపంచంలో అనేక దేశాలు సోషలిజం కోసం పోరాడుతున్నారు. ప్రపంచ పెట్టుబడి దేశంగా ఉన్న అమెరికా దేశంలో అక్కడ ఉండే యువత సోషలిజం వైపు వస్తున్నారని, అందుకే న్యూయార్క్ నగరంలో మేయర్ అభ్యర్థిగా సోషలిస్టు భావాలు ఉన్న వ్యక్తి గెలిచారన్నారు. కావున పోరాటాల ఫలితంగా సోషలిజం వైపు ప్రపంచం మారుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అన్వర్ బాషా, రైతుసంఘం మండల నాయకులు డాక్టర్ సుబ్బారాయుడు, జెవివి నాయకులు వేము పెంచలయ్య, సిఐటియు మండల కన్వీనర్ ఉప్పలపాడు మస్తాన్, వ్యకాసం మండల కార్యదర్శి నాగులూరు వెంకటేష్, ఖనికా సంఘం మండల కార్యదర్శి మీరా మొహిద్దీన్, డివైఎఫ్ఐ నాయకులు సంధాని, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట
మండలంలోని అనుమసముద్రం గ్రామంలోని రామాలయం వద్ద అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం శనివారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలోని అయ్యప్పమాల వేసిన స్వాములు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొని, అయ్యప్ప భజనలు చేయడం జరిగింది. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పడిపూజ కార్యక్రమానికి ఉభయ దాతలుగా జంగా నాగలక్ష్మి, సాయి శ్రీ కుందన, యద్దనపూడి రాము, యద్దనపూడి. లోకేష్, తదితరులు వ్యవహరించారు.

విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-కోవూరు
కోవూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఉచిత ఎన్‌ఎంఇఎంఎస్ శిక్షణను జెవివి కోవూరు మండల బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. విజయవాడలో ప్రత్యేక శిక్షణ పొందిన వి.నరేంద్ర, జి.మురళీధర్, ఎం.రాము కార్యక్రమంలో శిక్షకులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా జెవివి అధ్యక్షుడు చలపతిరావు, కార్యదర్శి ఎ.విజయ్‌కుమార్, ఖజాంచి బుజ్జయ్యతో పాటు కోవూరు మండల జెవివి సభ్యులు పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ఎన్‌ఎంఇఎంఎస్ పాఠ్యసామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు.

విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెన్ను వేణు

ప్రజాశక్తి-కావలి
ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం నిర్వహిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర అన్నారు. కావలి పట్టణ ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ పట్టణంలోని శివరామ సుబ్బయ్య భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ అలాగే 1970లో ఎస్‌ఎఫ్‌ఐ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యారంగ సమస్యల కోసం విద్యార్థులను కలుపుకొని ఎస్‌ఎఫ్‌ఐ బలమైన పోరాటాలు, కార్యక్రమాలు నిర్వహిస్తూ, దేశంలోనే బలమైన విద్యార్థి సంఘంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు పూర్తయినప్పటికీ విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఏవీ కూడా, పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. దాదాపు రూ.6వేల కోట్లకు పైగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే విద్యార్థులకు సంబంధించిన, 77జిఒను వెంటనే రద్దుచేసి, పిజి విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందేవిధంగా చూడాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల కోసం నిత్యం విద్యార్థుల సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించేందుకు, పని చేసేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఏదైతే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లావ్యాప్తంగా కూడా ఆందోళన బాట పడుతుందని తెలిపారు. అనంతరం కావలి పట్టణం నూతన ఎస్‌ఎఫ్‌ఐ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వై.జయంత్, పి.వినీల్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వెంకటబాలు, సహాయ కార్యదర్శులుగా వర్షిత్, అజ్మత్, అలాగే కమిటీ సభ్యులుగా రేవంత్, చైతన్య, కౌశిక్, సోహెల్, పార్థు, తేజేశ్వర్, మోక్షిత్, డేవిడ్, మనోజ్, ఉదయ్, మహేష్ ఎన్నికయ్యారు.

రెవెన్యూ డివిజన్‌కు మరో ఉద్యమం..

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి
ఉదయగిరిని రెవెన్యూ డివిజను ఏర్పాటు చేయాలని కోరుతూ ఉద్యమాన్ని ఉధృత పర్చాలని జిల్లా సాధన కమిటీ ఆదివారం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా స్థానిక ఐటిఐ కళాశాలలో జరిగిన ఉద్యమ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడాతూ 13న ఉదయగిరి పట్టణంలో ర్యాలీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఉదయగిరిలో రెవెన్యూ డివిజను ఏర్పాటు ఆవశ్యకతను ప్రజల ముందు పెట్టేందుకు సన్నద్ధ మవుతున్నామని జిల్లా ఉద్యమ కమిటీ అధ్యక్షుడు కె.వేణుగోపాల్ వెల్లడించారు. గత ఆరేళ్లుగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని ముందుగా ఉదయగిరి రెవెన్యూ డివిజను ఏర్పడైతే ముందుముందు ఇదేజిల్లాగా అభివృద్ధి చెందే అవకాశముంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలు కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పడనున్నాయని, ప్రజలు ఉద్యమించి రెవెన్యూ డివిజను కోరితే ప్రభుత్వం తమ డిమాండును నెరవేర్చక తప్పదన్నారు. ఇప్పటికే అనేక సార్లు తమ డిమాండును వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రభుత్వానికి తెలియపర్చామని తెలిపారు. ప్రజాభిప్రాయానికి ఏ ప్రభుత్వమైనా తలవంచక తప్పదన్నారు. 13న స్థానిక బస్టాండులో బహిరంగ సభ అంతకు ముందు ర్యాలీ ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఉద్యమ నాయకులు దస్తగిరి అహ్మద్, ఖాదర్ భాషా, వివిధ పార్టీల నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, బాలకృష్ణరెడ్డి, జాషువా, సోమిరెడ్డి, షంషీర్, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు జీలానిభాషా, షబ్బీర్, చెన్నకేశవ రావు, శ్రీను, రంతుజాని, రామిరెడ్డి, ఎస్దాని, ఖాజ పాల్గొన్నారు.

స్థలం పరిశీలన చేస్తున్న దృశ్యం

పంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి-సంగం
గాంధీజన సంఘం గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి రూ.32 లక్షల నిధులు మంజూరు చేశారని టిడిపి నాయకులు తెలియజేశారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో గాంధీజన సంఘం గ్రామంలో పంచాయతీ భవనానికి భారీగా నిధులు కేటాయింపులు జరిగిందన్నారు. రూ.32 లక్షల వ్యయంతో గాంధీజన సంఘం గ్రామంలో త్వరలో నూతన పంచాయతీ భవనం నిర్మాణం చేస్తామన్నారు. నిధుల మంజూరు నేపథ్యంలో గాంధీజన సంఘం గ్రామంలో స్థల పరిశీలన చేసిన పంచాయతీరాజ్ డిఇ సుధాకర్ రెడ్డి, ఎఇ రామయ్య, టిడిపి మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, గ్రామ టిడిపి నాయకులు మాణికల కృష్ణమూర్తి ఉన్నారు.

బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సాయం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ప్రజాశక్తి-కావలి
ఇటీవల అగ్నిప్రమాదంలో బోగోలు మండలం కొండ బిట్రగుంటకు చెందిన ఉదయగిరి శ్రీనివాసులుకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ సమాచారం కావలి రెడ్‌క్రాస్‌కు తెలుపగా, కావలి రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్‌క్రాస్ సభ్యులు ఉదయగిరి శ్రీనివాసులు కుటుంబానికి వంట పాత్రలు, నూతన దుస్తులు, టార్పాలిన్‌తో కూడిన రిలీఫ్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ కె.హరినారప రెడ్డి, పాలక మండలి సభ్యులుబెజవాడ ప్రసన్నకుమార్, గొట్టిపాటి మనోరమ, జీవిత సభ్యులు బెజవాడ అభిసాగర్ పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

అన్న ప్రసాద వితరణ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్
నగరంలోని వేదాయపాలెం శ్రీ కామాక్షితాయి దేవస్థానంలో శివపార్వతి అమ్మవార్లకు కళ్యాణోత్సవం సందర్భంగా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉన్నామని తెలిపారు. అందులో భాగంగా 250మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించామని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ధనంజయ, మురళి, కృష్ణయ్య, రమేష్, రాజశేఖర్, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'తల్లికి దీవెన' అందేనా..!

- **కుటుంబ మ్యాపింగ్‌తో విద్యకు మాయం**
- **భారమై.. దూరమైన విద్యశాతం**

ప్రజాశక్తి-ఉదయగిరి
మధ్య తరగతి తల్లిదండ్రులకు పిల్లల చదువులు భారం కాకుండా విద్యకు దూరం కాకుండా గత ప్రభుత్వాలు అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ నూతన భవనాలు రూపొందించి విద్యార్థుల చదువుకు దూరం కాకుండా విద్యార్థుల శాతాన్ని పెంచింది. ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తల్లులకు ఇచ్చిన హామీతో ఎంతగానో ఎదురుచూస్తున్న తల్లులకు మొండిచేయి ఎదురైంది.

ప్రభుత్వ తప్పిదాలతో తల్లులకు నిరాశ..
గతంలో అర్హత గల విద్యార్థుల జాబితాలను సచివాలయంలో ఏర్పాటు చేసి చేర్పులు మార్పులకు అవకాశం కల్పించి తుది జాబితాను సచివాలయం సిబ్బందితో తెలియజేసి అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న నగదును అందజేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల అర్హతల జాబితాను చూపకుండా మొత్తం కుటుంబంతో మ్యాపింగ్ చేసి నగదును ఇవ్వడం తప్పిదంతో ఎంతగానో ఎదురు చూసే అర్హత ఉన్న తల్లులకు తల్లికి దీవెన శాపంగా మారింది. దాంతో మధ్యతరగతి విద్యార్థిని తల్లిదండ్రులకు పిల్లల చదువులు భారం కాకూడదని ప్రభుత్వం అందిస్తున్న ఓ మంచి పథకం తమ పిల్లలకు ఈ ఏడాది అందక విద్య భారమవుతుందని తల్లులు ఆవేదన చెందుతున్నారు. తమ కుటుంబంలో ప్రభుత్వ పెన్షనర్ ఉన్నారని నెపంతో తమ ప్రభుత్వం అందిస్తున్న తల్లికిదీవెన పథకం దూరమైందని దాంతో మా పిల్లల విద్య తమకు భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సచివాలయ సిబ్బంది సమాధానం..
ప్రస్తుత ప్రభుత్వం కుటుంబ మ్యాపింగ్‌లో ప్రభుత్వ పెన్షనర్ 4 చక్రాల వాహనం ఇన్‌కమ్‌టాక్స్, ఎయిర్ ప్లేన్ ఎక్కినట్లుగా ఆన్లైన్ చూపినట్లయితే ప్రభుత్వం అందిస్తున్న తల్లికి దీవెన అందడం లేదని ప్రస్తుతం కుటుంబ మ్యాపింగులు తొలగింపులు జరిగేంత వరకు ప్రభుత్వ పథకాలు అందవని సమాధానంతో తలలు చేసేదేమీ లేక వచ్చే ఏడాదినా కూటమీ ప్రభుత్వం అందించే తల్లికి దీవెన పథకం వర్తిస్తుందా.. అనే ఆశతో ఎదురుచూస్తున్న తల్లిలకు ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు చర్యలు చేపట్టి కుటుంబ మ్యాపింగ్‌లో తొలగింపు చర్యలు చేపట్టేలా చూడాలని బాధిత విద్యార్థిని విద్యార్థుల తల్లులు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా అందించే ప్రభుత్వ పథకాలతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కోకూడదని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు దుద్దుకూరు రమేష్ నాయుడు పేర్కొన్నారు. నియోజక వర్గంలో వివిధ కారణాలతో ప్రభుత్వ పథకానికి దూరమైన అర్హులందరికీ ప్రభుత్వం వెంటనే స్పందించి కుటుంబ మ్యాపింగ్‌లో అర్హతకు గల విద్యార్థుల తల్లిదండ్రులను తొలగించి వారికి నగదును అందేలా చూడాలన్నారు.

అర్హులను ప్రభుత్వం గుర్తించి వారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలను అందించాల్సిన బాధ్యత అధికారులు ప్రజా ప్రతినిధులపై ఉందని సిపిఎం, రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బంది చేసిన తప్పిదాలతో అర్హత కలిగిన తల్లులకు ప్రభుత్వ పథకాన్ని అందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే వారి కుటుంబంలో నిబంధనలకు మించి యాడ్ అయిన వారిని తొలగించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.